గాంధీ కమ్యూనిటీహాల్‌ను మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌గా తీర్చిదిద్దుతా


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: గత పాలకుల నిర్లక్ష్యంతో డంపింగ్‌యార్డుగా మారిన కమ్యూనిటీహాల్‌ను త్వరలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌గా తీర్చిదిద్దుతామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. శనివారం తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీహాల్ చెత్త డంపింగ్‌యార్డును స్థానికులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. దశాబ్దాలుగా గాంధీ కమ్యూనిటీ హాల్ పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉండేదని కాని గత పాలకులు కమ్యూనిటీహాల్‌ను తొలగించి చెత్త డంపింగ్‌యార్డుగా మార్చారని అన్నారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డును బోర్డు అధికారుల సహకారంతో మరో ప్రాంతానికి తరలిస్తామన్నారు. సీఎంతో దృష్టికి తీసుకెళ్ళి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మించి అతి తక్కువ రుసుంతో పేదలు శుభకార్యాలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట రేమండ్, మేరి, సరిత, మురళి, మైకెల్, అంటోని, భవానీ, సామ్సన్, రాకేష్ ఉన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు..

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. శనివారం రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీలో ఆయన పర్యటించి అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌నిర్మాణ పనులు, కలుషిత జలాల సరఫరా, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, శిథిలావస్థకు చేరిన నివాస గృహాలు ఇతర సమస్యలను పరిశీలించారు. అనంతరం బోర్డు శానిటేషన్ విభాగం అధికారి మహేందర్‌కు ఫోన్‌చేసి కలుషిత జలాలు సరఫరా గురించి, విద్యుత్ ఏఈ అర్పితా రెడ్డికి ఫోన్ చేసి విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఆంజనేయులు, శ్రీనివాస్, మహావీర్, పార్టీ నేతలు శాంసన్ రాజు, ముప్పిడి గోపాల్, జిలాని పాల్గొన్నారు.


అధికారులకు ఫోన్ ద్వారా సమస్య వివరిస్తున్న దృశ్యం

పొదుపుతో పేదరికం దూరం



ఖాతా పాస్ పుస్తకాన్ని అందుకుంటున్న చిన్నారి

ఉస్మానియా యూనివర్సిటీ: పొదుపుతో పేదరికాన్ని దూరం చేయవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం యూపీఎస్సీ-2024 ర్యాంకర్లు నిరుపేద బాలికల కోసం ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ పోస్టాఫీసులో స్ఫూర్తి పేరుతో సుకన్య సమృద్ధి ఖాతా పాస్ పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పొదుపు చేసి పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది నిరుపేద బాలికలకు రూ.1000తో జమ చేసిన సుకన్య సమృద్ధి ఖాతా పాసు పుస్తకాలను అందజేశారు. యూపీఎస్సీ 3వ ర్యాంకర్ అణ్యరెడ్డి, ఐపీఓఎస్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూపీఎస్సీ ర్యాంకర్లతో పాటు పిల్లల తల్లిదండ్రులతో పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత, నర్సింహరెడ్డి, రాంరెడ్డి, అనురాగ్‌సింగ్, సుధాకర్‌రెడ్డి, నర్సింహరావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మాదే అధికారం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట: ప్రజల్ని సంఘటితం చేసుకుంటూ ముందుకెళ్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం తార్నాకలో నిర్వహించిన సికింద్రాబాద్ నియోజకవర్గం పోలింగ్ బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలిచి మేయర్ పీఠాన్ని దక్కించుకుని జీహెచ్‌ఎంసీపై కాషాయం జెండా ఎగురుతుందని అందుకే జీహెచ్‌ఎంసీ ఎన్నికలను ఏ విధంగా వాయిదా వేయాలి, ఎలా ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పని అయిపోయింది ఇక భవిష్యత్ లేదన్నారు. మాకు ఓటు వేస్తే మహిళలకు నెలకు 2500, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు, వ్యవసాయానికి ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని హామీలతో కాంగ్రెస్ వారు ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో బండా కార్తీకచంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, రవిప్రసాద్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, వీరన్న, సంపత్, శారదా మల్లేష్, రాము వర్మ, పోచయ్యయాదవ్, ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రివర్గంలో వంజర్లకు స్థానం కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

లాలాపేట: కేంద్ర మంత్రివర్గంలో వంజరి సామాజిక వర్గానికి స్థానం కల్పించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో సంఘం జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ మాట్లాడారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన దివంగత గోపీనాథ్ ముండే కేంద్ర కేబినెట్‌లోకి చేరిన 15 రోజులకే మరణించారని అనంతరం వంజర్లకు స్థానం కల్పించలేకపోయారని ఆ లోటును భర్తీ చేయడానికి ఈ సారి వంజర్లకు అవకాశం కల్పించాలన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధాత్రిక ధర్మరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వంజర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. తమ కులంలో ఉన్న పేదవారిని ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్సీగా అవకాశం, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎడుగని హరినాథ్, పోత్నాకు అంజయ్య, సూర్యనారాయణ, రత్నం సంతోష్, రామకృష్ణ, సత్యము, తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకులు కాలేరు సురేష్, కాలేరు రూప పాల్గొన్నారు.

బయటకొస్తే భయపెడుతున్నాయ్!



రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా పీజీరోడ్‌లోని సింధీకాలనీ, జవహర్‌నగర్ కాలనీ, కృష్ణానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బయటకు వెళ్తే వెంబడించి దాడులు చేస్తున్నాయి. ఇటీవల పీజీరోడ్‌లో తెల్లవారుజామున ప్రార్థనలకు వెళ్తుండగా యువతులపై వీధి కుక్కలు దాడి చేసేందుకు యత్నించగా అప్రమత్తమైన తప్పించుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రతి రోజు వందల సంఖ్యలో ఉన్న వీధి కుక్కలతో విద్యార్థులు, యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. – రాంగోపాల్‌పేట్

హమాలీబస్తీ వాసులకు ఇళ్లు ఇప్పిస్తాం


హమాలీబస్తీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ హామీ

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ హమాలీబస్తీ వాసులకు ప్రభుత్వ గృహాలను త్వరలోనే అందించేందుకు కృషి చేస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన హమాలిబస్తీ లబ్ధిదారులు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన తీరు, తమకు ఇళ్లు కేటాయించకుండా అధికారులు పదేళ్లుగా జాప్యం చేస్తున్న విధానాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జేఎన్‌ఎన్‌ఆర్‌యూఎం పథకం కింద గుడిసె వాసుల స్థలాలు తీసుకుని గృహాలు నిర్మించిన విధానం, 60 మందికి ఇళ్ల కేటాయింపు జరగని విషయం పట్ల ఇదివరకే అధికారులతో మాట్లాడామన్నారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

బౌద్ధనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత గరికపోగుల చంద్రశేఖర్, మైనారిటీ నేత మహమ్మద్ ఇషాఖ్ వారాసిగూడలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, నేతలు కంది నారాయణ, రాజ సుందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

సికింద్రాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అడ్డగుట్టకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబానికి బీఆర్‌ఎస్ సభ్యత్వ ద్వారా వచ్చిన రూ.2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ శనివారం కుటుంబ సభ్యులకు అందించారు. అడ్డగుట్టకు చెందిన పార్టీ నాయకుడు, వార్డు సభ్యుడు అంజయ్య కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అంజయ్య పార్టీ సభ్యత్వం తీసుకున్న సమయంలోనే ఆయనకు రూ.2 లక్షల ప్రమాద బీమాను పార్టీ అధిష్టానం చేయించింది. ప్రమాద వివరాలను బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయానికి అందించిన పార్టీ నాయకులు రూ.2 లక్షల బీమా చెక్కును ఇప్పించగలిగారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని లక్ష్మీప్రసన్న, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లాలాగూడ ఎస్‌హెచ్‌ఓగా కరుణాకర్‌రెడ్డి



అడ్డగుట్ట: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. నార్త్‌జోన్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఇది వరకు విధులు నిర్వహించిన కరుణాకర్‌రెడ్డి బదిలీపై లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎప్పటికప్పుడు నిఘా పెంచుతూ నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టే వేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రశాంతమైన వాతావరణం నెలకొలిపేలా తమవంతు ప్రయత్నం చేస్తామని నేరాల నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చోసుకుంది. అల్వాల్–బొల్లారంబజార్ రైల్వేస్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు కర్నూలు జిల్లా మంత్రాలయంకు చెందిన కే.వీరనాగులు(45)గా గుర్తించారు.

రైల్వే స్టేషన్‌లో జీఎం తనిఖీలు



సాక్షి, సిటీ బ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. విశాఖ, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికులతో మాట్లాడారు. ఆహారం, తాగునీరు, లైటింగ్, ఆన్ బోర్డ్ సేవలపైన ఆరా తీశారు.

'విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం'


అల్లూరి విజయ్

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యవస్థను చిన్న భిన్నం చేస్తున్నాయని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్ ధ్వజమెత్తారు. జాతీయ నూతన విద్య విధానం (ఎన్‌ఈపీ)తో కేంద్రం, విద్యాశాఖ మంత్రి, వైస్ చాన్సలర్స్, అధ్యాపకుల నియామకాలు చేపట్టకుండా పాఠశాలలను మూసివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వర్సిటీల అభివృద్ధికి తగినన్ని నిధులు విడుదల చేయకుండా ఇతర రంగాలకు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ తదితరాల ధరల పెరుగుదలతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారంపడి చదివించలేక పోతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించి పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

బోనాల జాతరను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్: తెలంగాణాలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. శనివారం ఆమె జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రిసిటీ, పోలీసు, ఫైర్, ఎండోమెంట్, వైద్య, ఆరోగ్య, ఫైర్ తదితర శాఖల అధికారులతో కలిసి దేవాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి ఆయా శాఖల అధికారులు చేపట్టే పనులపై ఆరా తీశారు. అన్ని శాఖల అధికారులు ఈ పాటికే తమ పనులు ప్రారంభించారని అధికారులు, భక్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించుకుంటే ఎలాంటి సమస్యలు రావన్నారు. జాతరలో అంబులెన్సులు, అగ్నిమాపక శాఖ యంత్రాలు రాకపోకలు సాగించేలా చూడాలని, బారికేడ్ల మధ్యలో అత్యవసర ద్వారాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఉప వాసాలతో వచ్చే మహిళ భక్తులు సొమ్మసిల్లి పడిపోయే అవకాశాలున్నాయని అలాంటి వారిని వెంటనే బయటకు తెచ్చి ప్రాథమిక చికిత్స అందించేలా వలంటీర్లకు శిక్షణ అందించాలన్నారు. ఎలక్ట్రిసిటీ అధికారులు విద్యుత్ పోల్స్ వద్ద షార్ట్స్ సర్క్యూట్ లాంటివి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వీవీఐపీ పాస్‌లు ఎక్కువ సంఖ్యలో ఇస్తుండటంతో సమస్యలు వస్తున్నాయని తెలిసిందని దీనిపై దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఈ సమావేశంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, అదనపు డీసీపీ పగడాల అశోక్, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటి, మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్ పాల్గొన్నారు.

మూలమలుపు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ ప్రధాన రహదారి మైలార్‌గడ్డ మూలమలుపు వద్ద వద్ద తరుచూ ప్రమాదాలు జరిగేవి. ఈ సమస్యపై ఇటీవల సాక్షిలో 'మైలార్‌గడ్డ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద శనివారం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మైలార్‌గడ్డ మూలమలుపు వద్ద వాహనదారులు, పాదచారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు సూచించారు.



ప్రమాదసూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నిధులు సరిపోక.. నిర్మాణం ముందుకు సాగక!

అర్ధాంతరంగా ఆగిపోయిన కమ్యూనిటీ హాల్ పనులు

చిలకలగూడ: శుభకార్యాలు, బస్తీ సమావేశాలు నిర్వహించుకునేందుకు నిర్మించాలనుకున్న కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి కేటాయించిన నిధులు ఖర్చయిపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. సీతాఫల్‌మండి డివిజన్ ఎరుకల బస్తీలో రూ. 90 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మూడేళ్ల క్రితం ప్రారంభోత్సవం చేశారు. బురద నేల కావడంతో పటిష్టమైన పునాదితో పిల్లర్లు వేసేందుకు అనుకున్న దానికంటే రెండింతలు వ్యయం ఎక్కువైంది. గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్ నిర్మించేందుకే ప్రతిపాదిత వ్యయం సరిపోయింది. కేటాయించిన నిధులన్నీ ఖర్చయిపోవడంతో కాంట్రాక్టరు తన వల్ల కాదంటూ చేతులెత్తేయడంతో నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. బస్తీవాసులు అభ్యర్థన మేరకు మరో రూ.75 లక్షల ప్రతిపాదిత వ్యయంతో రీటెండర్‌కు వెళ్లాలని సంబంధిత జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి నిధులు కేటాయించి ఎరుకలబస్తీ కమ్యూనిటీహాలు భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని బస్తీవాసులు కోరుతున్నారు.



◆ ఎరుకలబస్తీ కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నామని, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందించగా, అదనపు నిధులు కేటాయించేందుకు ఆమె అంగీకరించారని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. రీటెండరు ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం



కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీగణేష్‌ను శనివారం పీసీసీ కార్యదర్శి అయూబ్‌ఖాన్, సీనియర్ నాయకులు అఫ్సర్‌ఖాన్, బీసీసెల్ కార్యదర్శి రాజేష్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శ్రీగణేష్ హయాంలో కంటోన్మెంట్ ఎంతో అభివృద్ధి చెందుతుందని అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.63, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 58, పందిరి బీర 45, క్యాబేజీ 28, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 31, దోసకాయ 23, రూట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 28, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

జ్యోతిష్యం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మారావునగర్: జ్యోతిష్య శాస్త్రంపై ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రోలాజికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జ్యోతిష్యం ఇతరత్రా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు రాంచందర్ రావు పేర్కొన్నారు. జ్యోతిష్యం, వాస్తు హస్తరేఖ శాస్త్రాల్లో జ్యోతిష్ ప్రవీణ, జ్యోతిష్య విశారద కోర్సులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని శ్రీ కౌతాకామ కోటి కల్యాణ మండపం ఆవరణలోని కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 92463 48354, 99890 88111 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందిస్తున్న సభ్యులు

అమీర్‌పేట: వచ్చే నెల జరగనున్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లపై నిర్వహించే సమావేశానికి రావాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం అందించారు. ఈ నెల 25వ తేదీన ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, సూపరింటెండెంట్ హైమవతి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నామన శేషుకుమారి, కూతురు నర్సింహ ఉన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సైదులు

బౌద్ధనగర్: వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శనివారం సీఐ సైదులు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేయరాదని రానున్న పండుగల సందర్భంగా గొడవల్లో తలదూర్చవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం

రాంగోపాల్‌పేట్: కస్టమ్స్ అండ్ సీజీఎస్టీ హైదరాబాద్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన సదానందంను శనివారం సికింద్రాబాద్‌లోని సాలిటైర్ హోటల్‌లో కస్టమ్స్ అండ్ సీజీఎస్టీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందం విధుల్లో ఎంతో అంకితభావంతో పనిచేసే వారని పలువురు ఉద్యోగులు కొనియాడారు. అలాగే అసోసియేషన్ ద్వారా ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమం, హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు.

'అమ్మ దీవెన' పాట ఆవిష్కరణ


పాటను ఆవిష్కరిస్తున్న ప్రొ.గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: అమ్మ దీవెన పాటను ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌతమి ఫిలిం మేకర్ బ్యానర్ పై రూపొందించిన పాటను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. ఉన్నత విద్యా, ఉద్యోగాలతో పట్టణాల్లో జీవిస్తున్న నేటితరం యువత, గ్రామాల్లో ఆస్తుల కోసం తల్లిదండ్రులకు దూరమవుతున్నారని ఇలాంటి తరుణంతో తల్లిదండ్రుల ప్రేమ కోసం అందరిని ఆలోచింపచేసే ఈ పాటను ఆలకించి ఆదరించాలని కోరారు. ఈ పాటను హైకోర్టు న్యాయవాది దాసర్ల శ్రీశైలం రచించగా జగదీష్ దుగాణ ఆలపించారు. ఈ కార్యక్రమంలో అశోక్ యాదవ్, రాంబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగి అదృశ్యం


వెంకట సాయికుమార్

రాంగోపాల్‌పేట్: జలమండలిలో సీనియర్ ఆఫీసర్‌గా పనిచేసే ఉద్యోగి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్‌కు చెందిన పద్మాంజలికి వెంకట సాయికుమార్ (47)తో 2000 సంవత్సరంలో పెళ్లికాగా వీరికి ఓ కుమారుడు ఉన్నారు. వీరు 2018 వరకు కలిసి ఉండగా కుటుంబ గొడవలతో భార్య మల్కాజ్‌గిరిలో ఉంటుండగా భర్త రెజిమెంటల్‌బజార్‌లో నివసిస్తున్నాడు. కోర్టు ఆదేశాలతో గత ఐదేళ్ల నుంచి భార్యకు మెయింటెనెన్స్ కింద నెలకు రూ.15 వేలు చెల్లిస్తున్నాడు. గత నెలలో భార్యకు చెల్లించాల్సిన మెయింటెనెన్స్ చెల్లించకపోవడంతో పాటు ఫోన్ కూడా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో ఆమె జలమండలి కార్యాలయానికి వెళ్లి వాకబు చేయగా గత 6 నెలల నుంచి విధులకు రావడం లేదని అధికారులు చెప్పారు. రెజిమెంటల్‌బజార్‌లోని వెంకట సాయికుమార్ సోదరుడిని అడిగినా ఆయన ఎక్కడున్నాడో తెలియదని చెప్పాడు. తెలిసిన వారి ద్వారా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే హోటల్ పద్మజా రూమ్ నంబర్–15లో గత కొద్ది రోజుల నుంచి ఉంటున్నాడని తెలిసింది. అక్కడికెళ్లి చూసినా లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.